క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



వెంగన్నపాలెంలో శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: వెంగన్నపాలెం, గాంధీనగర్, జూలూరుపాడు తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, ధరావత్ రాంబాబు ఆదివారం భూమి పూజ నిర్వహించి, లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, నున్నా రంగారావు, మాదుగుల నాగరాజు, వల్లోజి రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆగస్టు 9న కుమురంభీమ్ విగ్రహావిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: పాతసూరారంలోని కొయ్యగుంపులో ఆగస్టు 9న కుమురంభీమ్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు సోయం సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లిలోని కుమురంభీమ్ భవనంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోకాళ్ల శ్రీనివాసరావు, కల్లూరు జయబాబు, తాటి శేషు, పెద్ద నాగరాజు, వెంకట్రావ్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలని వినతి



ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు పుట్టెడు కష్టాలు, ఆర్థిక భారంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని, ప్రజా ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చిందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా పంటలకు గిట్టుబాటు ధర హామీలు అమలు కావడం లేదని తెలిపారు. అన్నదాతలకు యూరియా కొరత లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

గడువు పొడిగించండి..

కొత్తగూడెంఅర్బన్: మసీదులలో సేవలు అందిస్తున్న ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలను పునరుద్ధరించేందుకు గడువు తేదీని నెల రోజులు పొడిగించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులను కోరారు. గౌరవ వేతనాలను కొనసాగించటానికి పాన్‌కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అధికారులు చెప్పటంతో, వీటిని పొందేందుకు ఇమామ్ మౌజన్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శికి లేఖలు పంపించినట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

ఇటీవల కాలంలో పాల్వంచ మున్సిపల్ డివిజన్ పరిధిలో అనేక సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేందుకు హడావుడిగా పలుచోట్ల శంకుస్థాపనలు కూడా చేశారు. కానీ ఈ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో స్థానికులు సతమతమవుతున్నారు. కొత్త రోడ్లు, డ్రెయినేజీలతో రూపురేఖలు మారుతాయని ఆశించిన ప్రజలు పెదవి విరుస్తున్నారు.



గుంతలమయంగా ఒడ్డుగూడెం మసీదు రోడ్డు

- వర్షాలతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు

పాల్వంచ: పట్టణంలో అతి పెద్ద ఏరియా ఒడ్డుగూడెంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. టీచర్స్ కాలనీ, సబ్ స్టేషన్ ఏరియా, చాకలిబజార్, కొమ్ముగూడెం, శ్రీనివాసకాలనీ, గట్టాయిగూడెం తదితర ఏరియాలకు చెందిన అనేక మంది స్థానికులు ఎక్కువగా సబ్ స్టేషన్ పక్క రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఒడ్డుగూడెం మసీదు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడింది. వర్షాల కారణంగా ఈ గుంతలు మరింత పెద్దగా మారి వర్షం నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది. నిత్యం వందలాది మంది ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇక మసీదు ముందే పెద్దపెద్ద గుంతలు ఉండటంతో ముస్లింలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు.

ప్రారంభం కాని పనులు...

డివిజన్ పరిధిలో నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావడం లేదనే ఆరోపణలున్నాయి. రూ.25 లక్షలతో ఒడ్డుగూడెం మసీదు రోడ్డుతో పాటు, ఆ పక్కన ఉండే మరో రోడ్డు సైతం సీసీ రోడ్డు వేయక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించే క్రమంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డులో కంకర తేలి ఉందని, ఇటీవల ఈ రోడ్డుకు కూడా నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డీఈ మురళీని కోరగా... ఒడ్డుగూడెం మసీదు వద్ద రోడ్డు పనులు వర్షాల వల్ల ఆలస్యం అయిందని, ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పారు.



ప్రమాదకరంగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం..



ఒడ్డుగూడెం మసీదు రోడ్డు పెద్దపెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షం వస్తే ఈ రోడ్డు కుంటను తలపిస్తోంది. తక్షణం సీసీ రోడ్డు వేయడంతో పాటు నీళ్ల వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలి. మసీదుకు సైతం ముస్లింలు నిత్యం వచ్చిపోతుంటారు. వారికీ ఇబ్బందులు తప్పడం లేదు.

– సురేష్, ఒడ్డుగూడెం

అధికారులు స్పందించాలి..



సీసీ రోడ్లకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదు. గుంతలమయంగా మారిన రోడ్డుపై వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై తక్షణం చర్యలు తీసుకొని స్థానికుల ఇబ్బందులు తొలగించాలి.

– సత్యనారాయణ, పాల్వంచ

యూరియాను ఫ్రీ మార్కెటింగ్ చేయండి..



మాట్లాడుతున్న అశోక్

ఇల్లెందు: రెండు నెలలుగా సాగు సీజన్ ప్రారంభమైంది. రైతులకు సరిపడా ఎరువులు ముఖ్యంగా యూరియా సరఫరా జరగకపోవడం వల్ల తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అన్నదాతలకు సరిపడా యూరియా సరఫరా చేయాలని ప్రజాఫ్రంట్ డిమాండ్ చేసింది. ఆదివారం ఇల్లెందులో ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామటెంకి అశోక్, ఎట్టి ప్రశాంత్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, యూరియా సరఫరాకు ప్రణాళిక లేకపోవడం వల్లనే రైతులు ఇబ్బంది పడుతున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికాయుతంగా ఎరువులు సరఫరా చేయాలని కోరారు. యూరియా ధర రూ.266 ఉండగా డీలర్లు రూ.400 అమ్ముతున్నట్లు చెప్పారు. యూరియా కావాలంటే జింక్, నానో యూరియా కావాలంటే ఓ మందు డబ్బా అంటగడుతున్నారని తెలిపారు. అక్రమాలను అరికట్టి రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని కోరారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఆగస్టు 1న టేకులపల్లిలో భవన నిర్మాణ, ఇతర కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ టేకులపల్లి ఏరియా కార్యదర్శి దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం తుమ్మలచలక, పెట్రాంచలక, బద్దుతండా, ఎర్రాయిగూడెం, మొక్కంపాడు తదితర గ్రామాలలో కరపత్రాలు ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులకు చట్టబద్ధహక్కులు, సౌకర్యాలు, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల పిల్లల డెలివరీ డబ్బులు మరియు ప్రమాద బీమా చెల్లించాలని కోరారు. జిల్లాలో పలు పెండింగ్ కేసులు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని లేదంటే భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెనకా సత్యం, ఈసం కృష్ణ, ఈసం వెంకన్న, జిగట రవి, చీమల రాజశేఖర్, సువర్ణపాక సాయి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా రాంచందర్



రామ్‌చందర్

టేకులపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) టేకులపల్లి మండల కార్యదర్శి గుగులోత్ రామ్‌చందర్ నాయక్ తిరిగి జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రెండు రోజుల పాటు సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో మహాసభలు అశ్వారావుపేట పట్టణంలో జరిగాయి. ఈ మహాసభలో ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు. టేకులపల్లి మండల కార్యదర్శిగా ఏడు పర్యాయాలుగా పనిచేస్తున్న ఆయన మండలంలో 12 గ్రామ నూతన శాఖలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ ఆదివారం ఆయన మాట్లాడుతూ... జిల్లా బాధ్యతలో ఉంటూనే మండల పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మహిళా సంఘం, విద్యార్థి సంఘం, యువజన సంఘం, ఏఐటీయూసీ తదితర పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

గుడిసెవాసులను ప్రభుత్వం గుర్తించాలి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

చుంచుపల్లి: మండల పరిధిలోని కుమురం భీమ్ కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలను గుర్తించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కాలనీలో సీపీఎం బృందం పర్యటించింది. స్థానికుల సమస్యలను పరిశీలించారు. అనంతరం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఐదేళ్ల నుంచి పేదలు గుడిసెలు వేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నారని, ఎండ, వానలు సైతం లెక్కచేయకుండా తమ ప్రాణం కంటే భూమి ఆత్మగౌరవం ఇస్తుందని నమ్మకంతో ఇక్కడే నివాసం ఉంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వానికి కుమురం భీమ్ కాలనీలోని పేదలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వీరందరికీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, నందిపాటి రమేష్, కోట బాలకృష్ణ, సిద్దిల రాములు, రఘు, నాగదుర్గ, రుహీనా, జ్యోతి, రామకోటమ్మ పాల్గొన్నారు.

మొక్కలు దేశ ప్రగతికి ప్రతీక



మొక్కలు నాటుతున్న ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాసరాజు

చుంచుపల్లి: మొక్కలను విరివిగా నాటి పెంచితే అవి దేశ ప్రగతికి ప్రతీకలుగా నిలుస్తాయని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిషన్ ప్లాంటేషన్ ఒక మిలియన్ ట్రీస్ క్యాంపెయిన్‌లో భాగంగా కొత్తగూడెం ఈద్గా, అబ్దుల్ వహీద్ మస్జిద్‌లలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ.. మొక్కలు విరివిగా నాటుతూ భవిష్యత్ తరాలకు సీఐఓ పిల్లలు మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, కాంతారావు, జమాత్ ఏ ఇస్లామి జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ తాజుద్దీన్ ఖాన్, మహిళా అధ్యక్షురాళ్లు షెహనాజ్, జహంగీర్ షరీఫ్, ఉమర్ యజ్దాని ఫారూఖ్, హబీబ్, జరీన్ ఎజాజ్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జూలూరుపాడు: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ స్కీం పొందాలంటే రైతులు కిసాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. కిసాన్ కార్డు కోసం ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మండలంలోని నల్లబండబోడు, గుండెపుడి, జూలూరుపాడు రెవెన్యూ గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, ఈనెల 30వ తేదీతో రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్డు ఉంటేనే సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, పంట నష్టపరిహారం, పీఎం కిసాన్ డబ్బులు పొందుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆధార్ కార్డు, ఆధార్ నంబర్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌ను ఏఈఓకు అందజేసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

బాక్సింగ్‌లో జిల్లాకు ఎనిమిది పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు ఎనిమిది పతకాలను సాధించినట్లు ఆదివారం జిల్లా బాక్సింగ్ చీఫ్ ప్యాట్రన్ యర్రా కామేష్ తెలిపారు. మాట్లాడుతూ.. ఈ నెల 25 – 27 వరకు జరిగిన పోటీల్లో ఏ. ప్రవళిక, ఎం.హనిత్య, కె.ఆరుణ్‌కృష్ణ వెండి, కె.శరణ్య, కె.అమృత వర్షిణి, ఓ.సెహర్ష్ మహంత్, వి.సాయి, కిరణ్, ఆర్.గణేష్ బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని కోచ్‌లు జి.ఈశ్వర్, స్నేహాసింగ్, దుర్గేష్, బాక్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య బండారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు ఎం.పరందామరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ బండారి, ఎండీ షమీయుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోతు రాజా అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

సుజాతనగర్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదివాసీలకు గొడుగుల వితరణ



గొడుగులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని విద్యాధరి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని గంగమ్మ కాలనీ, క్రాంతి నగర్ గ్రామాలలో నివసించే ఆదివాసీ గిరిజనులకు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాధరి ఫౌండేషన్ వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వర్షంలో ఆదివాసులు తడవకుండా ఉండేందుకు రక్షణగా ఉండే గొడుగులను పంపిణీ చేసినట్లు వివరించారు. వర్షంలో తడవడం వలన సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున, ఆదివాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా గొడుగులో అవసరం ఉన్నవారు సమాచారం ఇస్తే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. విద్యా ధరి ఫౌండేషన్ వారు కొట్టి వెంకటేశ్వర్లు, రవీందర్, రాజేష్ ఖన్నా, కృషి కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

‘పీసువాగు’పై రైతుల ఆశలు

- 36 ఏళ్ల క్రితం పీసువాగు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన
- నిర్మాణం పూర్తయితే వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- ఈ ప్రభుత్వమైనా కరుణించేనా?



శంకుస్థాపన శిలాఫలకం



పీసువాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్

పాల్వంచరూరల్: ఏళ్లుగా రైతులు పీసువాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా పీసువాగు నిర్మాణానికి మాత్రం మోక్షం కలగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజా ప్రభుత్వమైనా కనికరించాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు సౌకర్యం లేక వర్షాధారంపై ఆధారపడి రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగితే పంటలు పండుతాయి. వర్షాలు కురవకపోతే రైతులకు కరువే. 36 సంవత్సరాల క్రితం మంజూరైన పీసువాగు ప్రాజెక్టును నిర్మాణం చేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోనే నాధుడు కరువయ్యాడు. మల్లారం గ్రామశివారులో అడవిలో గుట్టల నుంచి వచ్చే వరద నీరు ఏటా పీసువాగు ద్వారా వృథాగా పోతున్నాయి. ఈ నీటిని సాగునీరుగా అందించాలని 1989లో అప్పటి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా రూ.34లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. అటవీ భూమిలో పీసు వాగు ఉంది. అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేసి అటవీశాఖ పరిధిలో ఉన్న 33 ఎకరాల భూమిని గుర్తించి మరో ప్రదేశంలో ఫారెస్టుకు అప్పగించారు. పీసువాగు నిర్మాణంలో కొంత పనులు అయ్యాక నిర్లక్ష్యం చేయడంతో నిధులు వెనక్కు వెళ్లాయి. 2000 తర్వాత ఎమ్మెల్యే వనమా పీసు వాగు వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం చేసినప్పటికీ రైతుల పంటలకు సరిపోవడం లేదు.

పీసువాగు నిర్మాణాన్ని పునరుద్ధరిస్తే పలు గ్రామాలకు లబ్ధి...

మల్లారం, నర్సింహాసాగర్, లక్ష్మీదేవిపల్లి, బంజర, గుండ్లమడుగు గ్రామాల పరిధిలోని వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రైతులు రెండుపంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. నిలిచిపోయిన పీసువాగు ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పునరుద్ధరించాలని రైతులు, స్థానికులు అనేకసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

చాలా ప్రయత్నాలు చేశా...



మల్లారం గ్రామ వద్ద పైనుంచి వచ్చే వరద వృథాగా పోకుండా 36 ఏళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా పీసువాగు ప్రాజెక్టును నిర్మాణం చేయాలని నిధులు కూడా మంజూరు చేశారు. అట్టి నిధులతో కొంత పనులు కూడా చేశారు. పూర్తి కోసం గతంలో చాలా ప్రయత్నాలు చేశాను. ప్రాజెక్ట్ పూర్తయితే రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది.

– బరపటి వాసుదేవరావు, జెడ్పీ మాజీ చైర్మన్

ఎవరూ పట్టించుకోవడం లేదు...



పీసువాగు ప్రాజెక్టు నిర్మాణం జరిగితే పంటలకు సాగునీరు అందుతుంది. పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. పీసువాగు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేస్తే గిరిజన రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వృథా నీటిని పంటలకు సాగునీరుగా మళ్లిస్తే రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది

– వర్స నారాయణ, రైతు, మల్లారం

ప్రతిపాదనలు పంపుతాం..



మండలంలోని మల్లారం గ్రామ సమీపంలో గల పీసు వాగు ప్రాజెక్టు నిర్మాణం చేయాలని రైతులు కోరుతున్నారు. వాగులపై చెక్‌డ్యామ్‌ను నిర్మాణం చేయడం జరుతుంది. పీసువాగును పరిశీలించి పునరుద్ధరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు అయితే ప్రాజెక్ట్ నిర్మించే అవకాశం ఉంటుంది.

– బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

ఘనంగా శ్రావణ బోనాలు

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచ మైసమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం ఘనంగా శ్రావణమాస బోనాల పండుగ నిర్వహించారు. స్థానికులు బోనాలతో వచ్చి ప్రత్యే పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి చీరె, సారెలను తీసుకుని పల్లకీ సేవ ద్వారా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, షిర్డీ సాయిబాబా దేవాలయంలో సమర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ క్రాంతి మురారి, రమేష్, శరత్, కిరణ్‌కుమార్, మల్లేశ్, సతీష్, వెంకటేష్, కోటేశ్వరరావు, భాస్కర్, పాపారావు, మంగ్యా నాయక్, నాసరయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలో ఆదివారం ఘనంగా శ్రావణమాస బోనాల పండుగ జరుపుకున్నారు. బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా స్టేజీ, తొమ్మిదోమైలు తండా పంచాయతీ సాయనపేట గ్రామాల్లో భారీ సంఖ్యలో భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, గ్రామ దేవతలను పూజించి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



టేకులపల్లి: వెంకట్యాతండా స్టేజీలో...



టేకులపల్లి: బోనాలతో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్తున్న భక్తులు



పాల్వంచ: పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు